క్లుప్తంగా

నేడు చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

దర్శి: చీమకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్, ఇతర ఫోరం సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. దర్శి డివిజన్ పరిధిలోని చీమకుర్తి, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు రాతపూర్వకంగా ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయాలు, మీటర్ రీడింగ్ హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన అన్నీ సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

పుల్లలచెరువు: ధనుర్మాసం ఐదో రోజు సందర్భంగా ఉమ్మడివరం రామాలయంలో శుక్రవారం వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శంకుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేక పూలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాల పక్కనే మురుగు గుంత

పుల్లలచెరువు: మండలంలోని తెల్లగట్ల పాఠశాల పక్కనే పెద్ద మురుగు గుంత ఉంది. చాలాకాలంగా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల మధ్యలో ఇలా మురుగు గుంత ఉండటంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

దొనకొండ: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని ఎస్ఐ కె.అజయ్‌కుమార్ సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని, చాలామంది యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానా విధిస్తామని, లేకుంటే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

గుంతల మార్గంతో గుండెలు బేజార్

- ప్రయాణానికి అవస్థలు పడుతున్న గ్రామస్తులు
- సమస్యలతో సతమతమవుతున్న నల్లగుంట్ల



గుంతలమయంగా నల్లగుంట్ల ప్రధాన రహదారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్లలో సమస్యలు దీర్ఘకాలంగా తిష్ట వేయడంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి సుదూరంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంపై ప్రజాప్రతినిధులు, అధికారులు సీతకన్ను వేయడంతో సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్నూల్-గుంటూరు ప్రధాన రహదారిపై సుమారు 20 కిలో మీటర్ల దూరంలో కొర్రప్రోలు గిరిజన గూడెం ఉంది. అక్కడి నుంచి నల్లగుంట్లకు 3 కిలోమీటర్ల మేర లింకు రోడ్డు ఉంది. ఈ నేపథ్యంలో రెండేళ్ల



కంకర లేచిన కొర్రప్రోలు-నల్లగుంట్ల లింకు రోడ్డు

కిందట రోడ్డు నిర్మాణం కోసం 60 లక్షల రూపాయల మేర నిధులు మంజూరయ్యాయి. ఎవరూ టెండర్లు వేయక పోవడంతో రోడ్డు నిర్మాణం జరగలేదు. నిత్యం నల్లగుంట్ల నుంచి మండల కేంద్రంతో పాటు నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి వందలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గం గుంతలమయంగా మారడంతో దశాబ్దాలుగా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోనే ప్రాధాన్యం ఉన్న నల్లగుంట్లలో కనీస సౌకర్యాలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలమయంగా మారిన రహదారుల్లోని గుంతలు పూడ్చక పోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. దశాబ్దాలుగా గ్రామానికి సంబంధించిన సమస్యలు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలోని అనేక అంతర్గత రోడ్లకు ఇరువైపులా మురుగు నీటి కాల్వల నిర్మాణం జరగక పోవడంతో ఫలితంగా ఇళ్లలో వినియోగించిన నీటితో పాటు వర్షంపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచి ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రతరం కావడంతో గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇళ్లలో వినియోగించిన నీటిని రోడ్లపైనే నిలిచి ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా సమస్యలపై దృష్టి సారించి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లింకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



కొర్రప్రోలు నుంచి నల్లగుంట్ల వరకు 3 కిలో మీటర్ల మేర లింకు రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి ప్రయాణికుల కష్టాలు తొలగించాలి. దీంతో పాటు గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి.

– మొద్దు తిరుపతిరావు, నల్లగుంట్ల

డ్రైనేజీ కాలువలు నిర్మించాలి



గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలి. కాలువలు లేక పోవడంతో మురికి నీరు రోడ్లపైనే నిలిచి ఉంటోంది. దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది.

– కాశీరాంనాయక్, నల్లగుంట్ల

పాస్టర్‌ల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- వెయ్యి మంది పాస్టర్‌ల దంపతులకు దుస్తుల పంపిణీ
- క్రిస్మస్ గీతాలు ఆలపించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



పాస్టర్‌ల దంపతులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ



హాజరైన పాస్టర్లు

దర్శి: పాస్టర్‌ల కుటుంబాలకు అన్నీ వేళలా అండగా ఉంటామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాలులో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పాస్టర్‌ల దంపతుల సమేతంగా వెయ్యి మందికి దుస్తులు పంపిణీ చేశారు. బిషప్ బి.శ్యాంసన్, పాస్టర్‌లు గుంటూరి కృపానందం, జి.నరేంద్రకుమార్, జి.ఏసుదాసులు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ సందేశం అందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ క్రీస్తు గీతాలు ఆలపించగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో పుట్టిన రోజులు జరుపుకుంటుంటారని, ప్రపంచం మొత్తం కలిసి చేసుకునే పుట్టిన రోజే ఏసుక్రీస్తు పుట్టిన రోజని చెప్పారు. తమ తల్లిదండ్రులు బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డిలు ఎన్నో చర్చిలకు, ఎంతోమంది పాస్టర్‌లకు సాయం చేశారని, అందుకే ఏసుక్రీస్తు తమ కుటుంబాన్ని ఎల్లవేళలా కాపాడుతున్నారు చెప్పారు. నియోజకవర్గంలో తన తండ్రి నేర్పిన విధంగా 25 ఏళ్ళుగా పాస్టర్లకు సేవలందిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి తన గెలుపులో భాగస్వాములుగా ఉండి తనను ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే బూచేపల్లి సంతోషం వ్యక్తం చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచారంటే అందుకు పాస్టర్‌ల కృషి ఉందన్నారు. మొదటి నుంచి తన భర్త కష్టపడి సంపాదించిన దాంట్లో అందరికీ పంచడం అలవాటన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాస్టర్‌లకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.5 వేలు గౌరవవేతనంగా ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు పాస్టర్‌లకు గౌరవవేతనం ఎందుకని హేళన చేశారని మండిపడ్డారు. మళ్లీ ఎన్నికలు జరిగినప్పుడు గుర్తు పెట్టుకుని పాస్టర్‌ల జీవన భృతిపై వేటు వేసిన కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మారం ఇంద్రసేనారెడ్డి, జెడ్పీటీసీలు తాతపూడి రత్నరాజు, నుసుం వెంకట నాగిరెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, జిల్లా ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, గోళ్లపాటి మోషే, మాజీ మండల కన్వీనర్‌లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, మాజీ జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య, నాయకులు డగ్లస్, కేసనపల్లి నాగేశ్వరరావు, తప్పెట బాబూరావు, వేమిరెడ్డి చెన్నారెడ్డి, మజ్జువలి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో దర్శి నేతలకు పదవులు



గొంగటి శ్రీకాంత్‌రెడ్డి



గాలిమూటి దేవప్రసాద్



కొల్లా ఉదయ్ భాస్కర్

దర్శి: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గంలో దర్శి నియోజకవర్గం నాయకులకు చోటుదక్కింది. జిల్లా యూత్ అధ్యక్షుడిగా గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా గాలిమూటి దేవప్రసాద్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొల్లా ఉదయ్ భాస్కర్‌లను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా స్థాయి పదవులు ఇచ్చి తమకు గౌరవాన్నిచ్చిన దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చినందుకు, పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

నేడు జగనన్న జన్మదిన వేడుకలు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. ముందుగా ఉదయం 10 గంటలకు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని, పార్టీ కార్యాలయంలో జగనన్న జన్మదిన వేడుకలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం మండల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, ఆయా కార్యక్రమాల్లో ప్రతి గ్రామం నుంచి అన్ని విభాగాలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఎమ్మెల్యే కోరారు.

దర్శిలో రక్తదాన శిబిరం

దర్శి: స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు కేక్ కట్ చేసి అందరికీ అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని బూచేపల్లి విజ్ఞప్తి చేశారు.

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టిన రోజు వేడుకలు శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ వేడుకలు స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతాయని, మండలంలోని నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి



చందవరం ధాన్యం కొనుగోలు కేంద్రం

దొనకొండ: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని చందవరం రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2320, మామూలు రకం క్వింటాకు రూ.2300 ధర ఉంటుందన్నారు. తేమ శాతం 17 ఉండాలని ఏఓ రైతులకు సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

పెద్దదోర్నాల: మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర ఆకాంక్షించారు. మండల పరిధిలోని వై.చర్లోపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మెగా రుణమేళాలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రూపుల్లోని మహిళలు క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటూ ఎప్పటికప్పుడు రుణాలు కట్టుకుంటూ ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకుపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో పాటు ప్రతి ఒక్క మహిళ విద్య ప్రాముఖ్యతను గుర్తించాలని చెప్పారు. రుణాలు అందుకుని స్వశక్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం రవికుమార్ మాట్లాడుతూ చర్లోపల్లి బ్రాంచ్ రుణాలు అందజేయడంలో రూ.40 కోట్ల టార్గెట్‌ను దాటిందన్నారు. మహిళలకు రుణాలు అందజేయడంలో చర్లోపల్లి బ్రాంచ్ ముందంజలో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా 23 స్వయం సహాయక గ్రూపులకు రూ.3 కోట్ల రుణాల చెక్కు అందజేశారు. దీంతో పాటు లక్‌పతి దీదీలో భాగంగా 23 గ్రూపులకు రూ.25 లక్షలు, ముద్ర రుణాలు రూ.10 లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి బంగారంపై రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నల్లగుంట్ల, మోట్లమల్లికార్జున పురాల్లో బీసీ పాయింట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం హెచ్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ సాంబశివరావు, జిల్లా కో ఆర్డినేటర్, డీపీఎంలు ఫానిత, కృష్ణకుమారి, ఏపీఎం పోలయ్య, ఎర్రగొండపాలెం ఏరియా కో ఆర్డినేటర్ దానం, సీసీ ఆశీర్వాదం పాల్గొన్నారు.

గోల్ ఎంచుకుని దాన్ని అందుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- మోడల్ స్కూల్లో ఆల్ ఇన్ వన్ మెటీరియల్ పంపిణీ



ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ

దర్శి: విద్యార్థులు ఒక గోల్ ఎంచుకుని దాన్ని సాధించే వరకూ కష్టపడి చదవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 800 మంది విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మోడల్ స్కూల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా గత ప్రభుత్వంలో పాటశాలల రూపు రేఖలు మారాయన్నారు. విద్యార్థులకు బల్లలు, డిజిటల్ బోర్డులు వంటి అన్నీ రకాల వసతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే అందాయని పేర్కొన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన వంటి పథకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అభ్యసించాలని సూచించారు. ఆల్ ఇన్ వన్ పుస్తకాలు ఉపయోగించుకుని వాటి ద్వారా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్ మీచేతుల్లో ఉంటుందని చెప్పారు. మంచి జ్ఞానంతో ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కౌన్సిలర్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం

దొనకొండ: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకమని ఎంపీడీఓ ఎం. శ్రీదేవీ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పల్లెలే ప్రగతికి పట్టు కొమ్మలని, పల్లెలు లేనిదే దేశం లేదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వంతు పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కోరారు.


కొచ్చెర్లకోట రెవెన్యూ సదస్సుకు 118 అర్జీలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసదస్సుకు 118 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. గ్రామ సభలో వచ్చిన అర్జీలను తమ వీఆర్‌ఓతో విచారించి సమస్య పరిష్కరించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓ యేసయ్య, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడాలి



పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

త్రిపురాంతకం: శాంతిభద్రతల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పని చేయాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విలేకరులతో డీఎస్పీ మాట్లాడుతూ బెల్టు షాపులు ఏర్పాటు చేయకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేషనల్ హైవేపై ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తప్పనిసరన్నారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన అనంతరం పోలీసులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట సీఐ అసాన్, ఎస్ఐ శివబసవరాజు ఉన్నారు.

సర్వసభ్య సమావేశంలో నేతల ఆగ్రహం

- గ్రామాల అభివృద్ధిని అధికారులు అడ్డుకుంటున్నారని మండిపాటు
- ప్రజల కోసమే నాయకులు, అధికారులు పనిచేయాలని జెడ్పీటీసీ విజ్ఞప్తి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం పని చేయవద్దని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులకు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లను పనులు చేయనీయకుండా, నిధులు ఖర్చు చేయనీయకుండా అధికారులు అడ్డు పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, నాయకులు, అధికారులు సమష్టిగా ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు. సర్పంచ్‌లకు కూడా తమ గ్రామాలను అభివృద్ధి చేయాలనే కాంక్ష ఉంటుందని, దాన్ని అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని, కలకాలం ఏ ప్రభుత్వం ఉండదని, దాన్ని గుర్తించి అధికారులు మసలుకోవాలని సూచించారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎంతవరకు పరిష్కరించింది తెలిపే అధికారి కరువయ్యాడన్నారు. బాధ్యతలు మరిచి అలసత్వం ప్రదర్శిస్తున్నారని, కాలాను గుణంగా అధికారుల పనితీరు మారాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికే అధికారులు రాకుండా తమ కార్యాలయాల్లోని కింది స్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకోవటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్‌బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ రహమాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.